ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -134 పేజీలు - 04 వెల - 04/- శనివారం 20 జూన్ 2026

# సిఎం భరోసా

## సిఎం చంద్రబాబుతో సాయికృష్ణ తల్లి భేటీ



**కుటుంబసభ్యులతో కలసి వెళ్లిన విజయలక్ష్మి**

**సాయికృష్ణ అదృశ్యంపై విచార జరుగుతోందన్న సిఎం**

**ఎంతటి వారినైనా వదలబోమని చంద్రబాబు హామీ**

**కుటుంబానికి అండబగా ఉంటామని భరోసా**

**అమరావతి,జూన్ 19ఆంధ్ర ప్రగతి**

విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని సాయికృష్ణ కుటుంబసభ్యులు శుక్రవారం కలిశారు. సాయికృష్ణ తల్లితో పాటు ఇతర కుటుంబసభ్యులను ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబును సాయికృష్ణ కుటుంబసభ్యులు కలిశారు. తమకు న్యాయం చేయాలంటూ సాయికృష్ణ తల్లి కోరారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సాయికృష్ణ అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతం చేశామని వెల్లడించారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని సాయికృష్ణ తల్లికి **మిగతా 2లో...**



## ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి..

**పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు**

**కోల్‌కతాలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేశ్ భేటీ**

**ఏపీలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను వివరించిన లోకేశ్**

**కోల్‌కతాజూన్ 19ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక, తయారీ రంగ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఆయన కోల్‌కతాలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో**మిగతా 2లో...**

## ఏపీలో రెండు విషాదాంతాలు..

**కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి**




**ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య**

**శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం**

## వార్షిక రుణ ప్రణాళిక రూ.8.10 లక్షల కోట్లు

**బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రుణాలపై చర్చ**

**రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడి**

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన బ్యాంకర్ల కమిటీ భేటీ**




**అమరావతి,జూన్ 19ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో శుక్రవారం మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో 2026-27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్‌ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు**మిగతా 2లో...**



## మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

**ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి**

**రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి**

**83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం**

**హైదరాబాద్,జూన్ 19ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2లో...**

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

**మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్**

**జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్**



**హైదరాబాద్,జూన్ 19ఆంధ్ర ప్రగతి** హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷- పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు**మిగతా 2లో...**

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి**

**కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు**

**మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు**




## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి**

**ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం**

**ఒప్పందం ప్రకారం లెబనాన్‌పైనా సైనిక చర్యలు ఆపాలి**

**అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేసిన నెతన్యాహు**

**తాజా ఘర్షణలతో శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం**

**జూన్ 19(ఆంధ్ర ప్రగతి**

ఇరాన్-అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా **మిగతా 2లో...**



## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

**రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం**

**46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది**

**లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు**

**అమరావతి,జూన్ 19ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఎపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు **మిగతా 2లో...**



## మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

మొదటిపేజీ తరువాయి

ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి.

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

మొదటిపేజీ తరువాయి

సంస్థ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది.దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది.అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు.అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

ఇప్పటికే యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు ఏ దిశగా వెళ్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. లెబనాన్‌లో హింస ఆగకపోతే ఇరాన్-అమెరికా శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపీ పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి..

మొదటిపేజీ తరువాయి

సమావేశమై రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించారు. కోల్‌కతాలో వీసా స్టీల్ వైస్ చైర్మన్ విశాల్ అగర్వాల్, ఇమామీ గ్రూప్ డైరెక్టర్ ఆదిత్య అగర్వాల్, శ్రీ సిమెంట్స్ వైస్ చైర్మన్ ప్రశాంత్ బంగూర్‌లతో లోకేశ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం వ్యూహాత్మక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు.తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఎదుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి ఉన్న విస్తారమైన తీరప్రాంతం,



ప్రపంచ స్థాయి ఓడరేవులు, మెరుగైన లాజిస్టిక్స్, పరిశ్రమలకు అవసరమైన భూమి, నిరంతర విద్యుత్ లభ్యత వంటి అంశాలు పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఇన్వెస్టర్-ఫ్రెండ్లీ పాలసీలు పరిశ్రమల స్థాపనను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటైన 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్' ప్లాంట్ పనులు అనకాపల్లి వద్ద ఇప్పటికే ప్రారంభమయ్యాయని, దీంతో రాష్ట్రం ఉక్కు పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా మారుతోందని ఉదహరించారు.

ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు జాతీయ ఆర్థిక ధోరణులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రభుత్వ-పరిశ్రమల సహకారం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న చురుకైన విధానాన్ని వారు అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న లోకేశ్ విజ్ఞప్తికి వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

## నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

మొదటిపేజీ తరువాయి

పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.

ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# సీఎం భరోసా

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదని నవరంగ్ అన్నారు. సాయికృష్ణపై అనేక కేసులు ఉన్నాయి. ఇటీవల అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు వచ్చాయి. అయితే సాయికృష్ణ మిస్సయ్యాడంటూ పోలీసులు చెబుతున్నారు. పోలీసులే సాయికృష్ణను హతమార్చారని, లాకప్ డెత్ కింద కేసు నమోదు చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఐ నాగరాజును సస్పెండ్ చేయాడంతో పాటు.. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐపీఎస్ అధికారిని దర్యాప్తు అధికారిగా నియమించింది.

## ఏపీలో రెండు విషాదాంతాలు..

# కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి

**ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య**

**శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం**

**జూన్ 19ఆంధ్ర ప్రగతి**

ఏపీలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన హృదయ విదారక ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. కుటుంబ కలహాల కారణంగా రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐదుగురు పసిపిల్లలు ఉండటం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ దారుణాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండు ఘటనల వెనుక కుటుంబ సమస్యలే ప్రధాన కారణంగా ఉన్నాయి.

**ప్రకాశం జిల్లాలో తండ్రి ఘాతుకం**

ప్రకాశం జిల్లా చిమకుర్తి మండలం అగ్రహారం గ్రామంలో ఓ తండ్రి రాక్షసుడిగా మారాడు. భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో కన్నబిడ్డలనే కడతేర్చాడు. ఏకుల సుధాకర్ (35) అనే వ్యక్తి తన ముగ్గురు కుమార్తెలు గో అచ్యుత (13), పూజిత (11), లోకిత (8)లకు ఆహారంలో విషం కలిపి తినిపించాడు. వారు ముగ్గురూ మరణించారని నిర్ధారించుకున్న తర్వాత గ్రామ శివార్లలోని పొలానికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో సుధాకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ద

**శ్రీకాకుళంలో పిల్లలతో తల్లి ఆత్మహత్య**

ఇలాంటిదే మరో విషాద ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పసిపిల్లలతో సహా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పలాస-తలభద్ర రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై మూడు మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతులను పూజ (28), ఆమె కుమారుడు కుశాంత్ (5), కుమార్తె దీక్షిత (3)గా గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా భావనపాడుకు చెందిన పూజకు ఎనిమిదేళ్ల క్రితం అదే జిల్లా చలమయ్యపేటకు చెందిన వెంకటయ్యతో వివాహమైంది. విజయవాడలో నివాసముంటున్న ఈ కుటుంబం, వేసవి సెలవుల కోసం ఇటీవలే చలమయ్యపేటకు వచ్చింది. భర్తతో విభేదాల కారణంగా నిన్న ఉదయం పిల్లలతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిన పూజ, రాత్రంతా పలాస రైల్వే స్టేషన్‌లో గడిపినట్లు తెలిసింది. ఆ తర్వాత ఈరోజు ఉదయం పిల్లలిద్దరినీ గట్టిగా పట్టుకుని, వేగంగా వస్తున్న రైలు కింద దూకి ప్రాణాలు తీసుకుంది. తన కుమార్తె మృతికి అత్తింటి వేధింపులే కారణమని పూజ తల్లి ఆరోపిస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు వేర్వేరు జిల్లాల్లో జరిగిన ఈ ఘటనలతో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో ఐదుగురు చిన్నారులు ఉండటం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

## హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం



మొదటిపేజీ తరువాయి

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది.ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ఆత్మకూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రత్యేక కార్యక్రమం.

### ..ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలి.

### ..జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ జూన్ 19:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమం ద్వారా అధికారులు ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను పరిష్కరించేందుకు ఇది చక్కని అవకాశం అని జిల్లా ఎస్పీ తెలిపారు. శుక్రవారం నాడుఈ కార్యక్రమం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ , మరికొందరు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అధికారులు వారి వారి శాఖల వారీగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తారని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజల నుంచి అందిన వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఫిర్యాదులలో కొన్ని.....:**1.ఆత్మకూరు పట్టణానికి చెందిన ఆది నారాయణమ్మ, సర్వే నంబర్ 971లో ఉన్న తన 3 ఎకరాల భూమిని బాలస్వామి అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

2.మా ఇంటిని వేరే వాళ్లకి బాడుగకు ఇచ్చాము. కానీ ఇప్పుడు వారిని ఖాళీ చేయండి అని అడిగితే ఇల్లు ఖాళీ చేయడం లేదు.కావున మాపై దయ ఉంచి ఇల్లు ఖాళీ చేపించగలరని ఆత్మకూరు పట్టణం కొత్తపేట కాలనీకి చెందిన మున్వర్ బేగం జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

## ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్ 19ఆంధ్ర ప్రగతి**ంవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు.

## వార్షిక రుణ ప్రణాళిక

# రూ.8.10 లక్షల కోట్లు

మొదటిపేజీ తరువాయి




ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు. కాగా, ఎస్‌ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు.

# నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు.

..ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి.

..చదరంగం మేధో శక్తిని, ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రవి కృష్ణ.




జిల్లాస్థాయి చదరంగం పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 19:** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో అమెచ్యూర్ నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు.నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని,చదరంగం క్రీడ విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచే క్రీడా అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో మెలకువలను, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్ సుజాత, కోచ్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఓటర్ల సవరణ కార్యక్రమంలో పాల్గొన్న 38వ వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:** నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు ఓటర్ల సవరణ సర్ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 38వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ..భారత ఎన్నికల కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ సర్ కార్యక్రమంలో బి ఎల్ ఓ లతో కలిసి ఓటరు జాబితాని పరిశీలించి స్థానిక ఓటర్లలో తీవ్ర వ్యతిరేకత, సర్వత్రా విమర్శలు రాకుండా సర్ కార్యక్రమం ప్రతి ఇంటికి వెళ్ళి నిర్వహించాలి అని బి ఎల్ ఓ లు సచివాలయాల్లో నిర్వహించడం గమనార్హం ప్రతి ఇంటికి వెళ్లి నిర్వహించాలి అని ఆయన అన్నారు.పోలింగ్ బూత్ పరిధిలో ప్రజలకు బి ఎల్ ఓ లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాల్సిన బాధ్యత అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దివ్యాంగు రాలికి నిత్యవసర సరుకులు పంపిణీ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:**



నంద్యాల పట్టణంలోని రాయల్ కాంపౌండ్ కు చెందిన సావిత్రి అనే నిరుపేద దివ్యాంగురాలు కు గత మూడు నెలల క్రిందట ఆమె ఆర్థిక పరిస్థితి నేను గమనించి డిసేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో నంద్యాల బ్లడ్ బ్యాంక్ ఎండి బ్లడ్ అచ్చు సహకారంతో నిత్యవసర సరుకులు మరియు బియ్యం ప్యాకెట్ అందించడం జరిగినది. మరల దివ్యాంగురాలు సావిత్రి ఆర్థిక పరిస్థితిని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిపి మస్తాన్ వలి నంద్యాల బ్లడ్ బ్యాంకు ఎండి బ్లడ్ అచ్చు దృష్టికి తీసుకుని పోగా ఆయన స్పందించి ఆమెకు నిత్యవసర సరుకులను పంపిణీ చేయడం జరిగినది. దివ్యాంగులకు ఎల్లప్పుడూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బ్లడ్ అచ్చు గారు హామీ ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో నంద్యాల బ్లడ్ బ్యాంకు సిబ్బంది ప్రవీణ్, మనోహర్, పవన్, శివ,నాగార్జున, రహెల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

..కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు/తుగ్గలి జూన్ 19:** ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం, రెవెన్యూ పరిపాలనలో పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శుక్రవారం పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండల కేంద్రంలో 2 వ పర్యటన లో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులకు అందచేస్తూ, అర్జీలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీలు, పురోగతిలో ఉన్న అర్జీల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచామని, అర్జీదారులు తమ దరఖాస్తుల స్థితిని సులభంగా తెలుసుకునే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటికప్పుడు పరిష్కరించగలిగే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, కొంత సమయం అవసరమయ్యే సమస్యల విషయంలో వాటి పరిష్కార గడువును ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డి ఆర్ ఓ సి.వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# ఇంధనాన్ని పొదుపు చేద్దాం, పర్యావరణాన్ని కాపాడదాం.

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 19:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు ఇంధన వినియోగాన్ని తగ్గించడం లో భాగంగా ఇంధనాన్ని పొదుపు చేసి, పర్యావరణాన్ని కాపాడదాం అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.

శుక్రవారం పత్తికొండ నియోజకవర్గంలోని తుగ్గలి మండలంలో నిర్వహిస్తున్న పిజిఆర్ ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం మరియు జొన్నగిరి గోల్డ్ మైన్స్ లో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రెండు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. బస్సులో ప్రయాణించిన అధికారులందరూ టికెట్ ధర చెల్లించి ప్రయాణించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది, ప్రజలు ఇంధన పొదుపు చర్యల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.. సాధ్యమైనంత వరకు వ్యక్తిగత వాహనాలను తగ్గించి, ఆర్టీసీ బస్సులు వంటి ప్రజా రవాణా వ్యవస్థలను వాడటం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

బస్సుల్లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, సిపిఓ భారతి, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, సమాచార శాఖ డిడి జయమ్మ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, డి పి ఓ భాస్కర్, డ్వామా పిడి నరసింహా రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్టీసీ ఆర్ ఎమ్ శ్రీనివాసులు, డి ఎస్ ఓ రాజా రఘువీర్, డిసిహెచ్ ఎస్ డా. జఫ్రుల్లా, ఇంచార్జి డీఎంహెచ్వో డా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలి.

## కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 19:**
ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.

ఈ నెల 24 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు పత్తికొండ నియోజకవర్గం జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ ప్లాంట్ ను సందర్శించనున్న సందర్భంగా హెలిప్యాడ్, మైనింగ్ ఏరియా వ్యూ పాయింట్, ప్రాసెసింగ్ ప్లాంట్, బహిరంగ సభ ఏర్పాట్లను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా సభకు హాజరయ్యే ప్రజల కోసం రవాణా, తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న ఈస్టర్న్ ధార్వార్ క్రాటన్ ప్రాంతంలో బంగారు ఖనిజ నిల్వలను ఆధారంగా చేసుకుని జియో మైసూర్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీ వారు ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఖనిజ రంగ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెంపుకు, దేశీయ బంగారం ఉత్పత్తి వృద్ధికి దోహదపడనుందన్నారు. ప్రస్తుతం ఈ గనిలో రోజుకు సుమారు 1,000 టన్నుల ఖనిజాన్ని ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉందన్నారు. ప్రతి టన్ను ఖనిజం నుంచి సగటున 1 నుండి 1.5 గ్రాముల వరకు బంగారం వెలికితీయబడుతోందన్నారు. ప్రస్తుతం ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం సుమారు 30 కిలోగ్రాముల బంగారంగా ఉండగా, దీనిని మరింత పెంచేందుకు విస్తరణ పనులు చేపడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన తొలి ప్లాంట్‌ను విస్తరించడంతో పాటు, రెండో ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడుతున్నారన్నారు. దీంతో బంగారం ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుందన్నారు. దేశంలో ప్రైవేట్ రంగంలో అభివృద్ధి చెందుతున్న తొలి బంగారు గనుల ప్రాజెక్టులలో జొన్నగిరి గోల్డ్ మైన్ ఒకటిగా గుర్తింపు పొందుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా బంగారం ఉత్పత్తి పెరగడంతో పాటు, బంగారం దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని కొంత మేర తగ్గించే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో దేశీయ జ్యువెలరీ పరిశ్రమకు అవసరమైన బంగారం సరఫరాలో కూడా ఈ గని కీలక పాత్ర పోషించనుందన్నారు. మొత్తం 597 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ మైనింగ్ లీజ్ అమలులో ఉండగా, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, అనుమతులు తదితర ప్రక్రియలు పూర్తి చేయబడ్డాయన్నారు.

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు మాట్లాడుతూ కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన గోల్డ్ మైన్ (బంగారు గని) ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24వ తేదీన విచ్చేయనున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి గారు గోల్డ్ మైన్ ప్రాజెక్టును పరిశీలించి, రాష్ట్ర అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యత, బంగారం ఉత్పత్తి సామర్థ్యం, స్థానిక ప్రాంత అభివృద్ధిపై దీని ప్రభావం వంటి అంశాలపై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారన్నారు. గతంలో వివిధ కారణాలతో ఆలస్యమైన ఈ ప్రాజెక్టుకు ప్రస్తుత ప్రభుత్వం వేగవంతమైన అనుమతులు (ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు) మంజూరు చేసి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుందన్నారు. దీంతో జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రారంభానికి మార్గం సుగమమైందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించగా, భవిష్యత్తులో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు విస్తరించడంతో మరింత భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక యువతకు దాదాపు 1000 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జొన్నగిరి గోల్డ్ మైన్ ప్రాజెక్టు కేవలం తుగ్గలి మండలానికే కాకుండా పత్తికొండ నియోజకవర్గం, కర్నూలు జిల్లా మరియు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవనోపాధి మెరుగుపడటంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయన్నారు.

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటిష్టమైన భద్రతాచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మైన్స్ అధికారులు, పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ మనోహర్, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌కు రైతులకు నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీపై ఎరువుల పంపిణీ.

..ఆత్మనిర్భరతా మిషన్ కింద కందుల విత్తనాలు సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు.

..ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా పారదర్శకంగా యూరియా పంపిణీ.

..అంతర్ పంటలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు.

.. కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు/తుగ్గలి జూన్ 19:**
ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శుక్రవారం తుగ్గలి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మనిర్భరతా మిషన్ కింద కందుల విత్తనాలు, సబ్సిడీ రాయితీ పథకం కింద వేరుశనగ విత్తనాలు, ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియాను రైతులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తుగ్గలి మండలంలో రైతుల అవసరాలకు అనుగుణంగా 244.8 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏపీ ఏఐఎంఎస్ పోర్టల్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేయడంతో పాటు అనంతరం ఈ-పాస్ యంత్రంలో వివరాలను నమోదు చేయడం ద్వారా పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామని చెప్పారు. యూరియా బస్తా అసలు ధర రూ.1,457 కాగా, ప్రభుత్వం రూ.1,190 సబ్సిడీ అందిస్తున్నందున రైతులకు కేవలం రూ.266.50కే యూరియా అందుబాటులోకి వస్తోందని వివరించారు. ఆత్మనిర్భరతా మిషన్ కింద మండలంలో 8.8 క్వింటాళ్ల కందుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతర్ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఒక ప్యాకెట్ కందుల విత్తనాలను ఉచితంగా అందజేస్తోందని పేర్కొన్నారు. అలాగే మండలంలో 1,752 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. క్వింటా వేరుశనగ విత్తనాల ధర రూ.10,200 ఉండగా, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ కింద రూ.4,080 భరిస్తోందని, రైతులు తమ వాటాగా కేవలం రూ.6,120 చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు అంతర్ పంటలను ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతిని పరిరక్షించుకుంటూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, ధృవీకరించిన విత్తనాలు, సబ్సిడీ ఎరువులను వినియోగించి ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు.

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతు కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, యూరియా ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా గ్రామ స్థాయి నుంచి వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రైతులకు కందులు, వేరుశనగ విత్తనాలు, యూరియా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, రైతులు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ప్రజా సమస్యల పరిష్కారానికే జనతా వారధి

**---జిల్లా బీజేపీ కార్యాలయంలో అర్జీల స్వీకరణ -బాధితులకు అండగా ఉంటామన్న జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 19:** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'జనతా వారధి' కార్యక్రమానికి ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ప్రజల పక్షాన పోరాటం..**

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే 'జనతా వారధి'ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక, సామాజిక సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడతామని స్పష్టం చేశారు.

**అండగా ఉంటాం: నేతలు**

ముఖ్య అతిథి శ్రీధర్ యాదవ్ మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనతా వారధి కన్వీనర్ కాశెట్టి చంద్రశేఖర్, కో-కన్వీనర్ రవీంద్ర కుమార్ పాల్గొని, వచ్చిన ఫిర్యాదులను క్రోడీకరించి తదుపరి చర్యల కోసం అధికారుల వద్దకు తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

# నాటుసారా రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం.!

**-నవోదయం 2.0' అవగాహన సదస్సు.**





**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు, జూన్ 19:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవోదయం 2.ాా' కార్యక్రమంలో భాగంగా బండి ఆత్మకూరు మండలం నారపురెడ్డికుంట గ్రామంలో నాటుసారా తయారీ, అమ్మకాల నివారణపై శుక్రవారం ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు, జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్ సూచనలతో ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని, నాటుసారా వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ.. ఈ వృత్తిని మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా గౌరవప్రదమైన జీవితాన్ని సాగించాలని పిలుపునిచ్చారు.

**సదస్సులోని ముఖ్యమైన అంశాలు:**

ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు: నాటుసారా తయారీని పూర్తిగా మానుకునే కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 15,000 ఆర్థిక సహాయం (లోన్) అందించి, కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారం, గొర్రెల లేదా బర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి: సారా తయారీ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు డీఆర్డీఏ, ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైవింగ్, టైలరింగ్, కంప్యూటర్స్ వంటి కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

పిల్లల చదువులకు భరోసా: ఈ కుటుంబాలలోని పిల్లల భవిష్యత్తు కోసం గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పించి, వారి ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్ అందించి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే నాటుసారా మహమ్మారి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# జూన్ 21న నిర్వహించే నీట్ పునఃపరీక్షకు పటిష్ట ఏర్పాట్లు.

**..జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో 1,521 మంది విద్యార్థుల హాజరు.**

**..నీట్ అభ్యర్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం.**

**..సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మవద్దు.**

**..మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:**
ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ పునఃపరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి నీట్ పునఃపరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన నీట్ పునఃపరీక్షను జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎస్సీ డిగ్రీ కళాశాల, కేవీఎస్సీ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలోని ఈ ఐదు కేంద్రాల్లో మొత్తం 1,521 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 432 మంది విద్యార్థులు, 1,089 మంది విద్యార్థినులు ఉండగా, 10 మంది దివ్యాంగ అభ్యర్థులు కూడా పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు ముగుస్తుందని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక సడలింపులతో సాయంత్రం 6.20 గంటల వరకు సమయం కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు అడ్మిట్ కార్డు మాత్రమే తీసుకురావాలని సూచించారు. కష్టపడి సిద్ధమైన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, స్నాక్స్, నిరంతర విద్యుత్ సరఫరా కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. నీట్ పరీక్షకు సంబంధించిన తప్పుడు ప్రచారాలు, వదంతులు సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటిని నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించాలని కోరారు. పరీక్షా కేంద్రాలకు వచ్చే తల్లిదండ్రుల కోసం చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. అలాగే విద్యార్థులు సులభంగా పరీక్షా కేంద్రాలను గుర్తించేందుకు అన్ని కేంద్రాల వద్ద దిశా నిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షో రాణ్ మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. నిర్దేశిత గుర్తింపు పత్రాలు లేని అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలో ప్రవేశం కల్పించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రామునాయక్, అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, నంద్యాల ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్, కలెక్టరేట్ ఏఓ సుభాకర్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, డీఎంహెచ్ఓ వెంకట రమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, నీట్ కోఆర్డినేటర్ టి. వెంకటేశ్వర్లు, వివిధ పరీక్షా కేంద్రాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# పుణ్యజీవన హేతువు నలదమయంతులకథ.

**..గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 19:**
మహాభారతంలోని అరణ్య పర్వంలో పాండవులు విన్న కథలలో బృహదశ్వమహర్షి చెప్పిన నలదమయంతుల కథ, నమ్మకం ఉన్న వారికి శ్రవణమాత్రం చేతనే కలి దోషాలను హరిస్తుందని ప్రవచనకర్త డా. బోలుగద్దె అనిల్ కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ ఆధ్వర్యంలో నంద్యాల మండలం, పెద్ద కొట్టాల గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంనందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా వారు నాలుగవరోజు వారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ పాపాలను, కలిబాధలను తొలగించి పుణ్యజీవితం కలగడానికి నలదమయంతుల కథలోని సందేశం అన్ని కాలాల్లోని ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని, నలదమయంతులు పవిత్రమైన జీవనం వలననే ఋతుపర్ణ మహారాజు గారి దైవికవిద్య, కర్కోటకుని నాగశక్తి అనుకూలించి నలదమయంతులకు కలిబాధలు తొలగిపోయాయని , మనం పవిత్రమార్గంలో ప్రయాణిస్తే ప్రకృతి, దైవం మనకు అనుకూలిస్తుందని, పవిత్రమైన జీవనం చేసే వారికి తాత్కాలిక కష్టాలు తొలగి శాశ్వత సుఖాలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాసుస్వామి, శ్రీరామాలయం కమిటీ చైర్మన్ అన్నెపురెడ్డి నాగప్రసాద్ రెడ్డి, గండా బాలశివారెడ్డి, సుబ్బారావు, రాముడు, పెద్ద వీరయ్య, లక్ష్మిదేవి, ఈశ్వరరావు, కుమ్మరి మద్దిలేటి, ఎస్. ఎఫ్. ఎఫ్. మహిళా ప్రతినిధి ఇందిరాదేవి, బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల హక్కులు రక్షణ పై అవగాహన సదస్సు.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 19:** జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనల మేరకు19 న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కర్నూల్ సాయి నగర్, పుల్లయ్య కాలేజీ దగ్గర గల షిరిడి సాయి వృద్ధుల ఆశ్రమం నందు వృద్ధుల హక్కులు, రక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు.జడ్జి మాట్టాడుతు వృద్ధుల పట్ల జరుగుతున్న వివక్ష, వేధింపులు,శారీరక, మానసిక, ఆర్థిక మరియు నిర్లక్ష్యంపై సమాజంలో అవగాహన కల్పించడం మరియు వారికి తగిన రక్షణ కల్పించడం ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు.వృద్ధులకు కావలసిన ఉచిత న్యాయ సహాయం కొరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చు అని తెలిపారు. తల్లిదండ్రు ల మరియు వృద్ధుల పోషణ మరియు సంక్షేమ చట్టం 2007 గురించి అక్కడి వృద్ధులకు వివరించారు. వృద్ధ తల్లిదండ్రులు తమ పిల్లలనుండి జీవన భృతి పొందే హక్కును ఈ చట్టం కల్పిస్తుందని తెలిపారు.ఈ చట్టం ఆదేశాలను పిల్లలు ఉల్లంఘిస్తే జరమానా లేదా జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. వృద్ధుల సహాయర్థం ప్రతి వృద్ధాశ్రమం లందు, షెల్టర్ హోమ్స్ నందు, బ్యాంకుల నందు, రెవిన్యూ ఆఫీస్ లందు ప్యారా లీగల్ వాలెంటీర్స్ చేత హెల్ప్ డెస్కు ఏర్పాటు చేయడమైనది అని తెలిపారు.వీరు వృద్ధులకు సంబంధించిన లీగల్ ఎయిడ్ అప్లికేషన్లను తయారు చేయడంలోనూ వెల్ఫేర్ స్కీములను వివరించడంలోనూ పిల్లలనుండి మెయింటినెన్స్ పొందేందుకు కావలసిన మార్గదర్శకాలను తెలుపడం లోను సహాయ పడుతారని తెలిపారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ద్వారా ఏవైనా సమస్యలు ఉంటే తన సంస్థకు తెలుపగలరు అని తెలిపారు. ఈ సదస్సు లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయ వాది శివరామ చంద్రరావు, షిరిడి సాయి వృద్ధ ఆశ్రమం నిర్వాహకులు, ప్యారా లీగల్ వాలెంటీర్స్, వృద్ధులు పాల్గొన్నారు.

# నీట్ 2026 పునఃపరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు.

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.**

**పరీక్ష నియమ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు ... జిల్లా ఎస్పీ.**

**కర్నూలు జిల్లాలోని 16 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు హాజరుకానున్న 4,995 మంది విద్యార్థులు.**



**ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా క్రైమ్ జూన్ 19:**
జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఆదివారం నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పునఃపరీక్ష సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం తెలిపారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందని తెలిపారు. జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షకు కర్నూలు జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలలో 4,995 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ...నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షను ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఒక్కొక్క ఎగ్జామ్ సెంటర్ వద్ద ఒక సీఐ స్ధాయి అధికారిని నియమించడం జరిగిందన్నారు. 16 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్టాండ్ లో హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో తల్లిదండ్రులు, బంధువులు గుమికూడకుండా సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరించినా, పరీక్ష నిబంధనలను ఉల్లంఘించేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు హాల్ టిక్కెట్స్ లో సూచించిన నియమ, నిబంధనలు విద్యార్థులు చదువుకొని, వాటిని పాటించాలన్నారు.అన్ని పరీక్షా కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు.ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్ 112 లేదా డయల్ 100 కి జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 9121101100 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# ఇంధన పొదుపుకు అధికారుల వినూత్న అడుగు.

**..వ్యక్తిగత వాహనాలకు బదులు బస్సుల్లో ప్రయాణించిన జిల్లా యంత్రాంగం.**

**.."వన్ మంత్ - ఫోర్ విజిట్"లో ఆదర్శంగా నిలిచిన నంద్యాల అధికారులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:**
ఇంధన పొదుపు కేవలం నినాదంగా కాకుండా ఆచరణలో కూడా సాధ్యమేనని నంద్యాల జిల్లా అధికారులు నిరూపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం వ్యక్తిగత వాహనాలను పక్కనపెట్టి, సమిష్టిగా బస్సుల్లో ప్రయాణిస్తూ ప్రజలకు ఆదర్శవంతమైన సందేశాన్ని అందించింది. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ప్రాంగణం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజలకు సందేశం ఇచ్చే ముందు అధికారులు స్వయంగా ఆచరణలో చూపించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లా, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు విడివిడిగా వాహనాలు వినియోగించకుండా బస్సుల్లో సమిష్టిగా ప్రయాణించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమం ప్రతి పర్యటనలో ఇదే విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంయుక్త తనిఖీలు, సమావేశాలు, అధికారిక పర్యటనల సందర్భాల్లో ఒకే వాహనాన్ని వినియోగించడం ద్వారా ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ప్రభుత్వ వ్యయాలు కూడా ఆదా అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ చర్య ప్రజల్లో ఇంధన పొదుపుపై మరింత అవగాహన పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ఆత్మకూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం.

**..అర్జీలపై క్షేత్రస్థాయి పరిశీలనతో నెల రోజుల్లో పరిష్కారం లక్ష్యం.**

**..ప్రతి సమస్యపై అధికారుల వ్యక్తిగత బాధ్యత, ప్రజలకు నేరుగా సమాచారం అందజేయాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**





**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు/నంద్యాల, జూన్ 19:** ప్రజల నుంచి అందిన వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. "వన్ మంత్ ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఎం.ఎం. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాలతో పాటు, ప్రతి నెల ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి అక్కడ వరుసగా నాలుగు వారాల పాటు ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత నెలలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసిన ఈ విధానాన్ని ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను నేరుగా ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీలు సమర్పించిన వారికి రశీదులు అందజేసి, వచ్చే బుధవారం లోపు ఆయా గ్రామాల్లో అధికారుల బృందాలు పర్యటించి సమస్యలను పరిశీలిస్తాయని తెలిపారు. ఇళ్లు, స్థలాలు, పెన్షన్లు, రెవెన్యూ అంశాలు, భూమి వివాదాలు సహా ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

సమస్యల స్వభావాన్ని బట్టి మండల, నియోజకవర్గ, జిల్లా లేదా రాష్ట్ర స్థాయిలో పరిష్కార చర్యలు చేపడతామని, రాష్ట్ర స్థాయికి పంపాల్సిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిష్కారం సాధించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, అవసరమైన చోట వ్యక్తిగతంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిపై నిరంతర సమీక్ష ఉంటుందని, పూర్తి చేసిన పనులు, ఆర్థిక అనుమతులు పొందిన అంశాలు, ఆర్థికేతర సమస్యల పరిష్కార వివరాలను క్రమం తప్పకుండా నివేదించాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. త్వరలో అధికారులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి కార్యాచరణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన గ్రీవెన్స్ వ్యవస్థను ఇప్పుడు నియోజకవర్గ స్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం కలిగిందన్నారు. నెలలో వచ్చే నాలుగు వారాల్లో ఒక్కో మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కరించగల అంశాలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా క్రమపద్ధతిలో తమ సమస్యలను అధికారులకు వివరించి, ఈ ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన వినతులు

1)ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ రిజవ్వాన తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, ప్రస్తుతం తన అత్త హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో తన భర్త హుస్సేన్ పేరు లేకపోవడంతో, ఆయన పేరును కూడా అదే హౌస్‌హోల్డింగ్ మ్యాపింగ్‌లో చేర్చాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

2)ఆత్మకూరు పట్టణానికి చెందిన సి. ఆది నారాయణమ్మ, సర్వే నంబర్ 971లో ఉన్న తన 3 ఎకరాల భూమిని బాలస్వామి అనే వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు.

3)ఆత్మకూరు పట్టణంలోని ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన కె. రూపవతి, తాను గతంలో మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో పనిచేసినప్పటికీ ప్రస్తుతం ఉద్యోగం మానేశానని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో తాను టీజీటీ హిందీ ఉపాధ్యాయురాలిగా, ప్రభుత్వ ఉద్యోగిగా నమోదై ఉండటంతో "తల్లికి వందనం" పథకం ప్రయోజనం అందడం లేదని పేర్కొన్నారు. అందువల్ల తన పేరును ప్రభుత్వ ఉద్యోగుల జాబితా నుంచి తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు అడుగులు.



**ఆంధ్ర ప్రగతి గాజులపల్లి/ మహానంది జూన్ 19:** నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లెలో రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు రైతులకు సేంద్రీయ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అధికారుల ప్రోత్సాహంతో ఓ రైతు అన్నా వెరైటీ ఆపిల్ సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో రైతు మస్తాన్ తన వ్యవసాయ క్షేత్రంలో సేంద్రీయ పద్ధతుల్లో అన్నా వెరైటీ ఆపిల్ సాగు చేస్తున్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు పొలాన్ని సందర్శించి సాగు విధానాలను పరిశీలించారు. రైతులకు సేంద్రీయ ఎరువుల ప్రయోజనాలు, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.అన్నా వెరైటీ ఆపిల్ మొక్కలు అధిక ఉష్ణోగ్రతలను కూడా తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని రైతులు చెబుతున్నారు. 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ రకం సాగుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. నెలలో మూడు సార్లు మాత్రమే నీరు అందించినా మొక్కల పెరుగుదల సజావుగా సాగుతుందని పేర్కొన్నారు.సుమారు మూడు సంవత్సరాల తర్వాత ఆపిల్ పంట కోతకు వస్తుందని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కడైనా విక్రయించుకోవచ్చని రైతు మస్తాన్ తెలిపారు. ఆపిల్ తోటతో పాటు మామిడి, జామ, నిమ్మ తోటలను కూడా సాగు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం నుంచి మరింత సబ్సిడీ, ప్రోత్సాహం లభిస్తే ఇతర వెరైటీల పండ్లను కూడా సాగు చేస్తామని రైతు మస్తాన్ తెలిపారు. సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తున్నాయని చెప్పారు.సాంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్న వేళ, గాజులపల్లెలో అన్నా వెరైటీ ఆపిల్ సాగు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. అధికారులు కూడా రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ ఉద్యాన పంటల విస్తరణకు కృషి చేస్తున్నారు.

## జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి.

**..ప్రజల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచండి.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 19:** జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపడుతున్న "యోగాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం యోగాంధ్ర, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల నిర్వహణపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21న జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న "యోగాంధ్ర" కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుర్తించి యాప్ లో నమోదు చేసిన అన్ని యోగా వేదికల వద్ద సమర్థవంతమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిజమైన స్ఫూర్తితో నిర్వహించాలన్నారు. మొక్కుబడి రీతిలో కేవలం లక్ష్య సాధన కోసమే కాకుండా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను నిర్ణీత సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి పౌరుల నమోదు, వేదికల నమోదు, ట్రైనర్ల మ్యాపింగ్ వంటి ప్రక్రియలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం నమోదైన పౌరులకు యోగా శిక్షణ అందించి, శిక్షణ పొందిన వారి హాజరు వివరాలను యాప్‌లో నమోదు చేయడం అత్యంత ముఖ్యమైన అంశమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది పాల్గొనేవారు, 4,600 యోగా వేదికలు నమోదు చేయబడినట్లు వెల్లడించారు. ప్రతి వేదిక జియో ట్యాగింగ్ చేయబడిందని, ఆయా వేదికల వద్దే యోగా కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం హాజరు, ఫోటోలు, ఇతర వివరాలను వేగంగా అప్‌లోడ్ చేసేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను జెసి ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యా శాఖల సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి సౌలభ్యానికి అనుగుణంగా సమయాలను సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామం, సచివాలయ స్థాయిలో యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన లోఅభివృద్ధి

**.. సంక్షేమం సభను నిర్వహించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.**





**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 19:** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన అభివృద్ధి సంక్షేమ సభలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించి రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. ప్రజలపై, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టలేదని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గం కూడా అభివృద్ధి బాటలో వేగంగా పయనిస్తోందని, గ్రామాలు, పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, విద్య మరియు వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే ప్రభుత్వం ఇది. రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నాం. అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరే వరకు మా ప్రయాణం ఆగదు" అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.

"వెన్నుపోటు రాజకీయాల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు"

ఆళ్లగడ్డలో నిర్వహించిన ఎన్డీఏ ప్రభుత్వ రెండేళ్ల పాలన సభలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వైసీపీ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వెన్నుపోటు రాజకీయాలు చేశారని ఇతరులను విమర్శించే ముందు వైసీపీ నాయకులు తమ చరిత్రను ఒకసారి చూసుకోవాలి. మిమ్మల్ని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టిన నాయకులను, మీకు రాజకీయంగా అవకాశాలు కల్పించిన ప్రజలను మరిచిపోవడం వెన్నుపోటు కాదా?" అని ప్రశ్నించారు.

మహిళా సాధికారత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

మహిళలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారని అన్నారు.

వైసీపీ నాయకులు మళ్లీ అధికారంలోకి వస్తామని కలలు కంటూ, తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు.

"ప్రజల తీర్పును గౌరవించకుండా బెదిరింపుల రాజకీయాలు చేయడం వైసీపీ సంస్కృతి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు చేసిన పనులు, ప్రజలకు కలిగించిన ఇబ్బందులు ఇంకా ప్రజలకు గుర్తున్నాయి" అని అన్నారు. "మాకు కూడా ఎన్నో అన్యాయాలు జరిగాయి. మా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నాం. అయినప్పటికీ ప్రతీకార రాజకీయాల కంటే అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తున్నాం.

ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు, ఉద్యోగ అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు.

"ఈరోజు మేమంతా ప్రజల్లోకి ధైర్యంగా, గర్వంగా వెళ్తున్నాం. ఎందుకంటే మేము చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలే మా బలం. వైసీపీ నాయకులు ప్రజలకు చెప్పుకోవడానికి ఏముంది? ప్రజలే సరైన సమయంలో సరైన తీర్పు ఇస్తారు" అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు.

"అభివృద్ధిని చూపించి ఓట్లు అడిగే హక్కు కూటమి ప్రభుత్వానిదే"

స్థానిక సంస్థల ఎన్నికల్లో

**ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలి : ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలి**

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే నైతిక అర్హతను కోల్పోయారు.

గత ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేయకుండా కక్షసాధింపు రాజకీయాలు, అరాచకాలు, అక్రమ కేసులతో కాలం గడిపారు.

ప్రజల సమస్యలను పట్టించుకోకుండా రాజకీయ వేధింపులకే ప్రాధాన్యత ఇచ్చారు. అని విమర్శించారు.

"కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఊపు వచ్చింది. గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు చేపట్టాం. ప్రజలకు కనిపించే అభివృద్ధి చేశాం, ప్రజలకు ఉపయోగపడే సంక్షేమాన్ని అందించాం" అని అన్నారు. అందుకే ప్రజల ముందుకు వెళ్లి అభివృద్ధిని చూపిస్తూ ఓట్లు అడిగే హక్కు కూటమి ప్రభుత్వానికే ఉంది. మా పనితీరును, మా అభివృద్ధిని ప్రజలే చూస్తున్నారు.

ప్రజల ఆశీర్వాదంతో మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతాం" అని తెలిపారు.

అలాగే, "ఇది కేవలం రెండేళ్లలో జరిగిన అభివృద్ధి మాత్రమే. ఇంకా మిగిలిన మూడేళ్లలో ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపే విధంగా మరిన్ని పనులు చేపడతాం. ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరే వరకు మా కృషి కొనసాగుతుంది.

ఈ సభాముఖంగా ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా అమలు చేస్తామని హామీ ఇస్తున్నాను" అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## వైసీపీకి భారీ షాక్.. టీడీపీలోకి 60 కుటుంబాల చేరిక.

**చిలకలూరు గ్రామంలో టీడీపీకి పెరుగుతున్న ఆదరణ**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**






**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 19:** రుద్రవరం మండలం చిలకలూరు గ్రామంలో వైసీపీకి చెందిన 60 కుటుంబాలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలోఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, "తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న టీడీపీ వైపు అన్ని వర్గాల ప్రజలు ఆకర్షితులవుతున్నారు" అని అన్నారు. గతంలో ప్రజలను మోసం చేసిన వారు ఇప్పుడు ప్రజల మధ్యకు వెళ్లలేని పరిస్థితి వచ్చిందని పేర్కొంటూ, అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో శివగౌడ్ ఓబన్న, శేషారెడ్డి, సుబ్బారెడ్డి, సంఘ విశ్వనాథ్, చాకలి సుధాకర్, జాల సుంకన్న, చాకలి రమేష్, కంప సుబ్బరాయుడు, సాకలి సునీల్ తదితరులు ఉన్నారు. వారితో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నాయకత్వం, కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే టీడీపీలో చేరుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

## ఆలయాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయండి..!

**-దేవాదాయ శాఖ అధికారులకు మంత్రి బీసీ సూచన.**



**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూన్ 19:** దేవాదాయ శాఖలో పనిచేయుచున్న ప్రతి అధికారి దేవస్థానములు అభివృద్ధే ధ్యేయమనే భావనతో పని చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నందు జిల్లా దేవస్థానముల ఇంజనీరింగ్, కార్య నిర్వహణ అధికారులతో దేవస్థానముల యందు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.జి.యఫ్ నిధుల నుండి జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పనిచేయు విషయముపై పటిష్టమైన చర్యలు గైకుని పనులు వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా దేవస్థానం యందు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈఈ శ్రీనివాస ప్రసాద్, జిల్లా దేవదాయ శాఖ అధికారి పాండురంగారెడ్డి, నందవరం ఈవో శ్రీనివాసరెడ్డి, ఈవోలు వీరయ్య, తనిఖీ అధికారి హరిచంద్ర రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఏఈ కిరణ్, స్టపతి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.